పచ్చికతో ప్రమాదం

- తొలకరి వర్షాలతో కలుషితం
- పశువుల్లో గొంతు, జబ్బవాపు
- జీవాలలో చిటుకు రోగం

బూర్గంపాడు: తొలకరి వర్షాలకు భూమంతా పచ్చబడుతుంది. వ్యవసాయ భూములలో, బీడు భూములలో పచ్చిక చిగురిస్తుంది. వేసవిలో మేతకు అలమటించిన మూగజీవాలకు మేత దొరుకుతుంది. అయితే తొలకరిలో పచ్చిక తినడం వల్ల పశువులకు ప్రమాదాలు పొంచివున్నాయి. పశువులు,జీవాల పెంపకందారులు తొలకరిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

సూక్ష్మజీవులే కారణం..

వేసవిలో ఎక్కువగా ఎండుమేత తిన్నటువంటి పశువులు తొలకరి తరువాత ఒక్కసారిగా పచ్చిమేతకు వెంపర్లాడుతాయి. అయితే భూమిలో ఉండే సూక్ష్మజీవులు, పరాన్నజీవులు పచ్చికతో కలసి పశువుల కడుపులోకి వెళ్తాయి. దీంతో పశువులు అనారోగ్యానికి గురవుతాయి. అదేవిధంగా తొలకరి వర్షాలకు చెరువులు, కుంటలు, గుంతలలోకి కొత్తనీరు వస్తుంది. ఆ నీటిలో అంతర పరాన్న జీవులు, సూక్ష్మజీవులు చేరుతాయి. దీంతో నీరు కలుషితమవుతుంది. ఈ నీటిని తాగిన పశువులు, జీవాలు రోగాల పాలవుతాయి. ఈ పరిస్థితుల్లో పశువుల యాజమానులు తగు జాగ్రత్తలు పాటించాలి.

సోకే వ్యాధులివే..

తొలకరిలో పచ్చికను తినటం వల్ల, కలుషిత నీటిని తాగటం వల్ల పశువులలో పలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఈ సీజన్‌లో పశువులలో జబ్బవాపు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. క్లాస్టీడియం చోవై అనే బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఇది అంటువ్యాధిగా విస్తరిస్తుంది. ముఖ్యంగా దూడలలో, పెయ్యలలో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి నివారణకు పెన్సిలిన ఆక్సి వంటి యాంటిబైటిక్స్ ఇవ్వాలి, యాంటిఫైరెటిక్స్, యాంటీ ఇస్టామిన్స్ వాడాలి. కార్డిజోన్, డైక్ట్రోజ్నర్మల్ సెలెన్ ఇవ్వాలి. అదేవిధంగా ఈ సీజన్‌లో పశువులలో గొంతువాపు వ్యాధి ముఖ్యమైంది. దీనినే గురక వ్యాధి అంటారు. గాలికుంటు ప్రబలిన ప్రాంతాలలో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు, జీవాలకు గొంతు, ఛాతి కింద భాగాల్లో వాపు కనబడుతుంది.జీవాల నోటి నుంచి, ముక్కుల నుంచి చొంగ కారుతుంది. కళ్లు ఎర్రబడతాయి.శ్వాస కష్టమై గురవ వస్తుంది. వెంటనే గుర్తించి చికిత్సలు అందించకపోతే పశువులు మృత్యువాత పడతాయి. యాంటీ బయోటిక్స్ వాడి పశువులను కాపాడుకోవాలి. తొలకరిలో గొర్రెలు, మేకలలో చిటుకురోగం వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జీవాలలో జ్వరం, పళ్లు కొరకటం, వణుకు, పొట్ట ఉబ్బటం, తల విదిల్చటం చేస్తుంటాయి. ఈ వ్యాధి సోకితే 12గంటలలోనే జీవాలు మృతిచెందే అవకాశాలున్నాయి. వ్యాధి లక్షణాలను గమనించి వెంటనే వైద్యసేవలు అందించాలి.


పచ్చిక మేస్తున్న జీవాలు

పచ్చికతో జాగ్రత్త



తొలకరిలో పశువులు, జీవాలు పచ్చిక తినటంతో రోగాలు బారిన పడతాయి. పచ్చిక తినే సమయంలో భూమిలోని సూక్ష్మజీవులు, పరాన్నజీవులు మేతతో పాటుగా పశువుల కడుపులోకి వెళ్లి వ్యాధులను కలిగిస్తాయి. అదేవిధంగా తొలకరి వర్షాలకు గుంతలలో చేరిన నీటిని తాగటం వల్ల కూడా పశువులు, జీవాలు రోగాల బారిన పడతాయి. తొలకరిలో వ్యాధులు వ్యాపించకుండా పశువుల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు, జీవాలకు సకాలంలో వ్యాక్సినేషన్ చేయించుకోవాలి.

– డాక్టర్ రవీందర్, మండల పశువైద్యాధికారి

క్లుప్తంగా

నూతన ఫీడర్ నిర్మాణానికి నిధులు

చండ్రుగొండ: చండ్రుగొండ నుంచి తిప్పనపల్లి మీదగా పెనుగడప వరకు నూతన ఫీడర్ నిర్మాణానికి రూ.70 లక్షలు, సబ్ స్టేషన్ కొత్త బ్రేకర్లు ఏర్పటుకు రూ.20 లక్షలు మంజురైనట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ బికంసింగ్ తెలిపారు. మండల కేంద్రం చండ్రుగొండలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదరు పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏడీఈ యాసీన్ ఏఈ నర్సింహారావు పాల్గొన్నారు.

రహదారిని పరిశీలించిన ఎన్‌హెచ్ బృందం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం- శ్రీరంగాపురం సమీపంలో ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారిని నేషనల్ హైవే అథారిటీ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. అశ్వారావుపేట-సత్తుపల్లి మధ్యలో నారంవారిగూడెం వద్ద ఐదు రోజుల వ్యవధిలోనే మూడు ఘోర రోడ్డు ప్రమాదాలు జరగగా, నలుగురు మృతి చెందారు. దీంతో స్థానిక సీఐ జితేందర్ రెడ్డి నేషనల్ హైవే అథారిటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు పరిశీలనకు వచ్చారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. వారి వెంట స్థానిక ఎస్ఐ శివరామకృష్ణ ఉన్నారు.

వరదలు వస్తేగాని పట్టించుకోరా?

కరకగూడెం: మండలంలోని చిరుమల్ల బ్రిడ్జి ఇరువైపులా కోతకు గురై నెలలు కావొస్తున్న పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోకపోవడం దారుణమని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చందా మధు అన్నారు.ఈ మేరకు ఆయన గురువారం సదరు బ్రిడ్జిని పరిశీలించి మాట్లాడుతూ.. గతేడాది భారీ వర్షాలకు పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడం ద్వారా బ్రిడ్జికి ఇరువైపులా దారి కోతకు గురై రైతుల పంట పొలాలు కొట్టుకపోయాయని, గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అన్నారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకముందే పాలకులు, అధికారులు బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

సింగరేణికే అప్పగించాలి..

మణుగూరుటౌన్: దేశంలో బొగ్గు బ్లాకుల వేలంపాటను ఏఐటీయూసీ వ్యతిరేకిస్తోందని, బొగ్గు బ్లాకులను బేషరతుగా సింగరేణికే అప్పగించాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం పీవీకాలనీలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలకు ముందు సింగరేణిని ప్రైవేటీకరించబోమని ఆ ఆలోచన లేదని ప్రధానమంత్రి హోదాలో ప్రకటన చేసిన మోదీ ప్రభుత్వం.. ఈ రోజు జరగబోయే బొగ్గు గనుల వేలంలో తెలంగాణలోని శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాకును చేర్చడం దేనికి సంకేతమో చెప్పాలని అన్నారు. సమావేశంలో నాగరాజు, ఆదర్ల సురేందర్, ఇమాముద్దీన్, ఆకులపల్లి చంద్రశేఖర్, గద్దం రవి, భీమ్‌సేన్ ఉన్నారు.

అత్యాచార ఘటనపై కేసు నమోదు

ములకలపల్లి: ఒంటరి మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటనపై ములకలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజమౌళి కథనం మేరకు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై, అదే గ్రామానికి చెందిన యువకుడు కాకాటి సాయి అత్యాచారానికి ప్రయత్నించాడు. ఎలాగోలా తప్పించుకున్న మహిళ.. సాయి తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేసింది. వారు సైతం సదరు మహిళను అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో ఈ ఘటనపై బాధిత మహిళ గురువారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

భద్రాచలంఅర్బన్: అనారోగ్య కారణాలతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్న, భద్రాచలానికి చెందిన యశోద్‌ను ఆదుకునేందుకు స్థానిక ఓ ఛానల్ నిర్వాహకుడు కార్తిక్ రామిశెట్టి ముందుకొచ్చారు. ఈ మేరకు దాదాపు రూ.25 వేలు పలువురి నుంచి సమకూర్చి గురువారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదగా యశోద్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఆర్థికంగా నిలదొక్కుకోలేని కుటుంబానికి బాసటగా నిలవడం అభినందనీయమని అన్నారు.

హామీని నెరవేర్చాలి

దుమ్ముగూడెం: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని ఈఫ్టు భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఈఫ్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు ఆటో యూనియన్ అడ్డాలను సందర్శించారు. ఈ సందర్భంగా ములకపాడు ఆటో అడ్డాలో చరణ్ పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు సతీష్, రవి, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో ఒలింపిక్ రన్


దమ్మపేటలో ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే, తదితరులు

దమ్మపేట: ఇంటర్నేషనల్ ఒలింపిక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండల కేంద్రంలో ముందస్తుగా నిర్వహించిన ఒలింపిక్ రన్‌ను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. గురువారం మండలంలోని దమ్మపేట గిరిజన సంక్షేమ గురుకులం, అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో ఒలింపిక్ జ్యోతిని వెలిగించారు. ఒలింపిక్ రన్‌లో స్వయంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ఆవరణను పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి బేషజాలకు పోకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎస్సై సాయికిషోర్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కరకగూడెం: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంట రాధా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుట్టుమిషన్ శిక్షణ పొందటం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కేంద్రాన్ని ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వడ్లమాను శ్రీలక్ష్మి, ఆముదాల శ్యామల, శ్రీదేవి, సామ్రాజ్యం, నిట్ట శ్రీదేవి, గంట సామ్రాజ్యం పాల్గొన్నారు.


కరకగూడెం: కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం వద్ద మహిళలు, ట్రస్ట్ సభ్యులు

ఆదివాసీలకే హక్కు కల్పించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని ప్రభుత్వ భూములపై ఆదివాసీలకే హక్కు కల్పించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు చర్ల మండలం లక్ష్మీకాలనీకి చెందిన 20 ఆదివాసీలు కుటుంబాలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. చర్ల గ్రామంలోని సర్వే నంబర్ 117లో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న గిరిజనులను ఎటువంటి సంబంధం లేని పలువురు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఏజెన్సీలో ప్రభుత్వ భూమిపై ఆదివాసీలకే పూర్తి హక్కు ఉంటుందని, ప్రభుత్వ అధికారులకు తెలిసిన ఆ దిశగా ఆదివాసులకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆదివాసులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చాప నాగేంద్రబాబు, మడకం రాము, పూనెం ముఖేష్, పూనెం రామారావు, పూనెం సమ్మయ్య, బిరబోయిన రాణి, ఎల్లబోయిన సునీత, కొర్సా లక్ష్మి, లక్ష్మి, శాంతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి


దుమ్ముగూడెం: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు, బోధ నేతర సిబ్బందికి ప్రమోషన్లు, బదిలీలు, వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విరామ సమయంలో గురువారం నిరసన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కారం సర్వేష్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్లకు అప్‌గ్రేడ్ ప్రమోషన్లు కల్పించాలని, ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లు అర్హత కలిగినవారితో భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, ఎస్.సత్యనారాయణ, బట్ట హరికృష్ణ, ఇర్పా అనసూయ, ప్రేమ్ కుమార్, కొర్సా వెంకటేశ్వరరావు, లకృతి, ఆంజినేయులు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్స్ తక్షణమే చేపట్టాలని చిరుమళ్ల ఆశ్రమపాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఆ పాఠశాలలో భోజన వీరామ సమయంలో స్వచ్ఛంద నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 13 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఒకే పాఠశాలలో 90 శాతం మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అంతేకాకుండా చాలా మంది ఎస్జీటీగా నియాకమై ప్రమోషన్లు లేక ఎస్జీటీలుగానే రిటైడ్ అవుతున్నారని పేర్కొన్నారు. సమాంతర విద్యా వ్యవస్థ అయిన జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలల్లో బదిలీలు, ప్రమోషన్స్ చక చకా జరుగుతుంటే ట్రైబల్ డిపార్ట్‌మెంట్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం పట్ల ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జగన్ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: ఎమ్మార్పీఎస్ మండల నూతన అడ్‌హక్ కమిటీని గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మోదుగు వెంకటేశ్వర్లు, మండల మహిళా అధ్యక్షురాలిగా బొల్లెపల్లి పద్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం మండల ఇన్‌చార్జ్ బోయిళ్ల నర్సింహారావు, సీనియర్ నాయకులు మాట్ల బాబురావు, జిల్లా నాయకులు కొమ్ము హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు రోజుల తరబడి అధికారుల కోసం వేచిచూడాల్సి వస్తుందని తెలిపారు. అధికారుల వైఖరిలో మార్పు రావాలంటే ఒకరిద్దరిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆరోపణలు అవాస్తవం

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో ఎస్అండ్‌పీసీకి అనుబంధంగా విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను తాము వేధిస్తున్నామన్న ఆరోపణల్లో నిజం లేదని పర్మినెంట్ గార్డులు తెలిపారు. ఈ మేరకు జమ్మేదార్‌లు, గార్డులు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఆపదలో అండగా ఉంటున్నామనే తప్ప వేధించిన దాఖలాలు లేవని చెప్పారు. కొందరు పర్మినెంట్ పోస్టులు కావాలని ఒత్తిడి చేస్తుండడంతో విధి నిర్వహణలో అందరూ సమానమేనని తాము చెప్పామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థకు సంబంధం లేని వ్యక్తులు తమపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

అండగా ఉంటాం

మణుగూరుటౌన్: గొత్తికోయ గ్రామమైన పెద్దిపల్లి గ్రామస్తులకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉంటామని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మణుగూరు పోలీసుల ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించి చిన్నారులకు ఆహారం, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. ఆరుబయట తిరిగే పిల్లలను పాఠశాలకు తప్పనిసరిగా పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత నారంవారిగూడెం గ్రామంలో చిన్న కొర్రాజుల స్వామి జాతర ఉత్సవాలు నాలుగు రోజులుగా సాగుతుంది. గురువారం జాతర ఉత్సవాల్లో భాగంగా చంద్రపట్నం, మైలపట్నం కార్యక్రమాన్ని నిర్వహించి స్వామి వారికి జలాభిషేకాలు చేశారు. జలాభిషేకం కార్యక్రమం తరువాత భక్తులు స్వామి వారిని దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. జాతర ఉత్సవాలకు భక్తులు పొటెత్తారు. కాగా శుక్రవారంతో జాతర ఉత్సవాలు చివరి రోజుకు చేరుతుండగా, ముగింపు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరు కానున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

త్వరలో డయాలసిస్ సేవలు

చర్లరూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చర్ల సీహెచ్‌సీకి మంజూరు చేసిన డయాలసిస్ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రధాన సమన్వయ అధికారి డాక్టర్ జి.రవిబాబు అన్నారు. ఈ మేరకు డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించేందుకు తగిన వసతులను పరిశీలించేందుకు గురువారం ఆయన చర్ల సీహెచ్‌సీని పరిశీలించారు. సెంటర్ ఏర్పాటుకు కావలసిన రూము, వాటర్ సప్లై, పవర్ సప్లైను సమకూర్చి మరో వారం రోజుల్లో సేవలు ప్రారంభిస్తామన్నారు. మార్చురీ గది కూడా పూర్తయిందని, అతి త్వరలోనే అందుబాటులోకి రానుందని అన్నారు. ఆయన వెంట ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, టీం లీడర్ హరిప్రసాద్, చర్ల సీహెచ్‌సీ వైద్యాధికారి సాయి వర్ధన్ ఉన్నారు.


చర్ల సీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

బూర్గంపాడు: సమస్యల పరిష్కారానికి నిరంతర ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సీపీఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు గురువారం బూర్గంపాడులో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాలు చేయాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అర్హులందరికీ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పార్టీ నిర్మాణం, కర్తవ్యాలపై పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, బయ్యా రాము, ఎస్‌కె.అబీదా, అజయ్‌కుమార్, రామనాథం, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతూనే ఉంటారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య అన్నారు. గురువారం యలమంచి సీతారామయ్య భవనంలో జరిగిన ఆ పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఈ రాష్ట్రంలో ప్రజలు సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం కమ్యూనిస్టు కార్యకర్తలు నాయకులు ప్రజలను బడుగు బలహీన వర్గాల ప్రజలను ఐక్యం చేసి సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతూనే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీ, మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, మండల నాయకులు యలమంచి శ్రీనుబాబు, మర్మం సమ్మక్క, కొడాలి లోకేష్ బాబు, వాగి ఖాదర్ బాబు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సోమయ్య

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


కరకగూడెం: అధికారులతో మాట్లాడుతున్న డీఎల్పీఓ కిశోర్ కుమార్

కరకగూడెం: గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని డీఎల్పీఓ కిషోర్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం పినపాక మండలంలో పర్యటించారు. ముందుగా జానంపేట గ్రామపంచాయతీ చేరుకున్న ఆయన గ్రామపంచాయతీలలో అవినీతి జరిగిందని అనేక ఫిర్యాదులు రావడంతో రికార్డులను పరిశీలించారు.అనంతరం గ్రామస్తులు అడిగి వివరాలు సేకరించి రికార్డు చేసుకున్నారు. గత సెక్రటరీ శ్రీనివాసరావు సైతం పిలిపించి గ్రామ పంచాయతీలో పూర్తిస్థాయిలో నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జానంపేటలో ప్రధాన రహదారిపై ఆక్రమిత దుకాణాలను తొలగించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పినపాక గ్రామ పంచాయతీలలో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. సర్వే ఆలస్యం అవ్వడంపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ బయ్యారం గ్రామపంచాయతీలో డ్రైయినేజీని పరిశీలించి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో నీరు నిలిచి ఉంటుందని గ్రామస్తులు తెలపడంతో తక్షణమే పనులను ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీఓను ఆదేశించారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో సైతం డ్రైయినేజీ వరకు ఉన్న నిర్మాణాలను తొలగించాలని సోమవారంలోగా డ్రైయినేజీ పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎంపీఓ వెంకటేశ్వరరావుతో జానంపేట సెక్రటరీ నాగిని, ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రెడ్‌క్రాస్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 12 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిలా కోఆర్డినేటర్ డా.ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, అలా చేస్తే ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వారికి పునర్జన్మని ఇస్తుందని ఆయన అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ డే సందర్భంగా కొత్తగూడెం రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రక్తదాతలను ఆయన శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ సెక్రెటరీ ఎం.మల్లారెడ్డి, చర్ల రోడ్డు బ్రాంచ్ మేనేజర్ ఎస్.మణికంఠ, యూనియన్ సభ్యులు, వై.రాజేష్, రమేష్, కె.నరేష్, బి.వరుణ్, పి.శివరామకృష్ణ, ఏ.ఉమేష్ కుమార్, కె.పుష్ప, ఎం.అశోక్ బాబు, డి.రామకృష్ణ , డి.వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్ ఏ.చంద్రప్రసాద్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఆదినారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

చర్లరూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై చర్ల వెలుగు కార్యాలయంలో సిబ్బందికి కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ గురువారం అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలు సోకినట్లయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. అలాగే సికెల్ సెల్ వ్యాధి గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ..

మండలంలోని వలస గిరిజన గ్రామమైన కందిపాడులో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమలమందు పిచికారీ చేశారు.

ఎమ్మెల్యేకు కార్మికుల వినతి

దమ్మపేట: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు దమ్మపేట గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. గురువారం గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యే జారేను కలిసిన కార్మికులు.. సమస్యలను ఆయనకు వివరించారు. తమ వేతనాలు పెంచి, క్రమబద్ధీకరించాలని విన్నవించారు. బీమా సౌకర్యం కల్పించి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బెజవాడ రాము, ధర్మ, మణికంఠ, నాగమణి, బసవయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో గురువారం అల్బెండజోల్ మాత్రలు వేశారు. సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారికి రక్తహీనత, నులి పురుగుల నివారణకు మాత్రలు అందించారు. ఈ సందర్భంగా.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాళ్లకు చెప్పులు వాడుతూ గోర్లు పెరగకుండా చూసుకోవాలని వైద్యాధికారులు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంఅర్బన్: బాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు


బూర్గంపాడు: టీఎస్ఆర్ఎస్ స్కూల్‌లో అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ శ్రీలత


దుమ్ముగూడెం: పాఠశాలలో నులిపురుగుల మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ సీతమ్మ